ఈనాడు కృష్ణా

ఆదివారం 20 ఆగస్టు 2017 | 20 పేజీలు

మదిలో నీతలపే..



శనివారం విజయవాడ ఏలూరు రోడ్డులో ఓ ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన సినీ నటి పూజా హెగ్డే

మట్టి గణపతికే.. మా మొదటి ప్రణామం
4లో

ఈనాడు క్లాసిఫైడ్స్
12, 13, 14, & 16, 17 పేజీలలో

మన రియల్ ఎస్టేట్స్
స్పెషల్ ఫీచర్
5వ పేజీలో...

మలిసంధ్య.. రాయితీల అండ
మధ్యపేజీల్లో

సహకారం.. సంక్షేమం

మురుగునీటిని మెరుగుపరచాలన్నా.. అపరిశుభ్రతను పారదోలాలన్నా.. ప్రజల గొంతులు తడపాలన్నా.. ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేరాలన్నా.. పంచాయతీ తీర్మానాలు అమలు చేయాలన్నా.. గ్రామ కార్యదర్శుల సహకారం అటు ప్రజలకు.. ఇటు ప్రభుత్వానికి ఎంతో అవసరం. వీరి కొరత నేపథ్యంలో నాలుగైదు గ్రామాలకు ఒక్కరే పనులు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఫలితంగా పంచాయతీల్లో పనులు పడకేసే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీల్లో పరిపాలనా పరమైన ఇబ్బందులను తొలగించే దిశగా రంగం సిద్ధమయ్యింది.





తిరువూరు మండలం మునుకుళ్ల ప్రధాన వీధిలో ఇదీ పరిస్థితి

- పంచాయతీ క్లస్టర్ల పునర్విభజన
- తీరనున్న కార్యదర్శుల కొరత
- కార్యాచరణ దిశగా కసరత్తు

న్యూస్‌టుడే-కలెక్టరేట్

జిల్లాలో ప్రస్తుతం అమల్లో ఉన్న పంచాయతీ క్లస్టర్ల విధానం కారణంగా ఖాళీగా ఉన్న కార్యదర్శుల పోస్టులను నేరుగా భర్తీ చేసే అవకాశం లేకపోవడం వల్ల అత్యధిక శాతం పంచాయతీల్లో వివిధ సమస్యలు తప్పడం లేదు. తీవ్రంగా ఉన్న కార్యదర్శుల కొరత కారణంగా ప్రభుత్వ కార్యక్రమాల అమల్లోనూ ఇబ్బందులతో పాటు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వీటిని దృష్టిలో ఉంచుకొని క్లస్టర్లను పునర్విభజన చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పంచాయతీల్లో కార్యదర్శుల కొరత నివారించేందుకు మార్గం సులభం కానుంది.



తిరువూరు మండలం చౌటపల్లిలో చేతిపంపు వద్ద నిలిచిన మురుగు

ప్రభుత్వ పరంగా అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్ర స్థాయికి చేరువ కావడంలో గ్రామ పంచాయతీలది కీలక పాత్ర. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ తదితరాలతో పాటు ప్రభుత్వ పరమైన అన్ని కార్యక్రమాల అమలు లాంటి అనేక కార్యక్రమాలు గ్రామ పంచాయతీల ద్వారానే అమలుకావల్సిన విషయం తెలిసిందే. పంచాయతీరాజ్ పరంగా పరిపాలనాపరమైన అంశాల్లో ఎంతో ప్రాధాన్యత ఉన్న గ్రామ పంచాయతీల్లో సుదీర్ఘకాలంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం గతంలో వీఆర్వో, వీడీవోలను గ్రామ కార్యదర్శులుగా నియమించడంతో కొంత మేర సమస్య తీరినట్టయ్యింది. తదనంతరం వీఆర్వోలు వారి మాతృశాఖకు (మిగతా 2లో)

అక్రమాలపై ఉక్కుపాదం

- జిల్లాలో 191 మద్యం గొలుసు దుకాణాల మూసివేత
- అక్రమంగా నిల్వచేసిన బియ్యం, నూనె భారీగా స్వాధీనం
- కాలం చెల్లిన మందులు, నిషేధిత గుట్కా అమ్మితే ఊరుకోం
- హెచ్చరించిన కలెక్టర్ బి.లక్ష్మీకాంతం

ఈనాడు, విజయవాడ

ఆహార కల్తీలు, అక్రమాలు, మద్యం గొలుసు దుకాణాలు, అనధికారిక ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపి అణచివేస్తున్నామని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం వెల్లడించారు. ఇప్పటివరకూ వందల మందిపై కేసులు నమోదు చేశామన్నారు. విజయవాడలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్, తూనికలు కొలతలు, పౌరసరఫరాలు, డ్రగ్ కంట్రోల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని శనివారం (మిగతా 2లో)

పట్టా భూముల్లో ఇసుక దందా..!



ఈ చిత్రంలోని ఇసుక మేటలు పరిశీలించారా..! కృష్ణా నదిలో కరకట్టకు సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేటలు ఇవి. విశేషం ఏమిటంటే పట్టాభూముల్లో వేసిన ఈ మేటలను తొలగించేందుకు రైతులు దరఖాస్తు చేసి అనుమతులు పొందారు. ప్రస్తుతం ఇవి వివాదాస్పదమయ్యాయి. పట్టాభూముల పేరుతో ఇసుక తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయనేది ప్రధాన ఆరోపణ.

ఈనాడు, అమరావతి

ఇసుక నిత్యావసర వస్తువుగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు వచ్చే రూ.వందల కోట్ల ఆదాయాన్ని వదులుకొని ఉచితం చేసినా సామాన్యులకు మాత్రం అందడం లేదు. అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రేవులు ఏర్పాటవుతున్నాయి. ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో పట్టాభూముల పేరుతో ఇచ్చిన అనుమతులపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై అనుమతులు ఇస్తున్నారని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికే ఫిర్యాదులు అందాయి. దీంతో నిఘా వర్గాలు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించడం చర్చనీయాంశమైంది.

దేవరపల్లి వివాదం ఇదీ..! : కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామంలో సుమారు 3.50 ఎకరాల భూముల్లో ఇసుక మేటలను తొలగించేందుకు గనుల శాఖ అనుమతులు జారీ (మిగతా 2లో)

- లంక భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- రైతుల పేరుతో ఇసుక మాఫియా
- హైదరాబాద్‌కు అక్రమ రవాణా
- రైతుల అభ్యంతరం.. నిరసనలు

అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాలపై ఎక్కడికక్కడ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 191 మద్యం గొలుసు దుకాణాలు, 16 లింకు రిటైల్ షాపులను మూసి 1897 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పది వాహనాలను సైతం సీజ్ చేశామన్నారు. ప్రజలకు బెల్ట్‌షాపులపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలోనూ సభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మైకుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజలు సైతం వీటిపై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

15 ఇసుక లారీల సీజ్: ఇసుకను అక్రమంగా తరలిస్తూ వినియోగదారులకు అధిక ధరకు విక్రయిస్తున్న 15 లారీలను ఇప్పటివరకూ సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనధికారికంగా ఇసుకను నిలువ ఉంచిన ఎనిమిది కేంద్రాలను మూసివేశామన్నారు. రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారి చెప్పారు. ఇసుకను అందరికీ అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిలోభాగంగా కేవలం ఇసుక తవ్వకం, లోడింగ్, రవాణా ఛార్జీలను నామమాత్రంగా వసూలు చేయాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నిషేధిత గుట్కా అమ్మితే జిల్లా బహిష్కరణ: నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించే వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. వీరిపై కేసులు పెట్టడంతో పాటు జిల్లా నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. మచిలీపట్నంకు చెందిన గిల్లి కిషోర్ అనే వ్యక్తిని ఇప్పటికే బహిష్కరించామన్నారు. మచిలీపట్నంలో గుట్కా అమ్మకాలు సాగిస్తూ దొరికిన పోల నాగరాజు, ఇనాము శ్రీను, అబ్దుల్ అజీజ్‌లపై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు.

బియ్యం అనధికార నిల్వలపై దాడులు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనధికారికంగా నిల్వ ఉంచిన బియ్యం మిల్లులపై పౌరసరఫరాలశాఖ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకుంటున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకూ పామర్రులోని బొండా ప్రభుకుమార్‌కు చెందిన లక్ష్మీనారాయణ రైస్ అండ్‌స్టోర్ మిల్లు, వెంకటేశ్వరా రైస్ అండ్ స్టోర్ మిల్లులపై దాడి చేసి రూ.2.08 లక్షల విలువైన 80.25 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశామన్నారు. మచిలీపట్నంలోని మాటూరి బాపన్నరావు సన్స్‌కు చెందిన దుకాణంలో రూ.39.24 లక్షల విలువైన 56,293 కిలోలు, విజయవాడ వన్‌టౌన్‌లోని చెన్నగిరి పద్మనాభరావు కిరాణా దుకాణంలో రూ.52.98వేల విలువైన 796కిలోల వంట నూనెను సీజ్ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కాలం చెల్లిన మందులు అమ్ముతున్నారు: జిల్లాలో పలువురు మెడికల్ షాపుల నిర్వాహకులు కాలం చెల్లిన మందులు అమ్ముతున్న విషయం తనిఖీలలో బట్టబయలైంది. జిల్లాలో 47 దుకాణాలు ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేయగా. . ఏడింటిలో కాలం చెల్లిన మందులు దొరికాయని వీటి లైసెన్సులను రద్దు చేసినట్టు లక్ష్మీకాంతం వెల్లడించారు.

* అధిక ధరలపై 50 కేసులు: గడువు తీరిన వస్తువులు, ఆహార పదార్థాలను విక్రయిస్తున్న, అధిక ధరలకు అమ్ముతున్న దుకాణ యజమానులపై 50 కేసులను నమోదు చేశామన్నారు. వీరికి రూ.2.15లక్షలను స్టాంపిగ్ ఫీజుగానూ, రూ.1.50లక్షల కాంపౌండ్ ఫీజుగా వసూలు చేసినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నాగేశ్వరరావు, విజిలెన్స్ డీఎస్పీ ఆర్.విజయపాల్, తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ పి.స్వర్ణ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు ఇ.సాంబశివరావు, ఎన్.కళ్యాణి, సిహెచ్.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో ఇసుక దందా..!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. కృష్ణా నదిలో మధ్యలో లంక భూముల్లో ఈ అనుమతులు ఉన్నాయి. కరకట్ట నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఈ భూములు ఉన్నాయి. అక్కడ సర్వే నెంబరు 212లో ఇద్దరు రైతుల పేరుతో అనుమతులు తీసుకున్నారు. తమ భూముల్లో ఇసుక మేటలు వేసినందున వాటిని తొలగించి సేద్యం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని రైతులు దరఖాస్తు చేశారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు ధ్రువీకరించడంతో రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి నిర్భ్యంతర పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి గనుల శాఖ నుంచి అనుమతి ఇస్తారు. అయితే పరిసర ప్రాంత రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇలా ఈ నెల 2న గుదిబండ సీతారామిరెడ్డి, బి.కృష్ణారెడ్డి అనే వ్యక్తులు అనుమతులు పొందారు. ఇది వివాస్పదం అయింది. వాస్తవానికి అక్కడ మేటలు తొలగించడం వల్ల పక్కనే ఉన్న తమ పొలాలకు ఇబ్బంది వస్తుందని ముంపునకు గురవుతాయని, కోతకు గురవుతాయని రైతులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేకపోవడంతో సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వాస్తవానికి అక్కడ ఇసుక తవ్వకాలకు అవకాశం లేదని ఆపేరుతో ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేయాలనేది ఇసుక మాఫియా ప్రణాళికగా రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. ఆయా భూముల పట్టాదారులతో మాఫియా దరఖాస్తు చేయించి అనుమతులు పొందుతున్నారని దీనివల్ల పరిసర ప్రాంత రైతుల భూములకు ముప్పు వస్తుందని చెబుతున్నారు.

సంయుక్త విచారణకు ఆదేశం..! : దేవరపల్లి సంఘటనపై జిల్లా కలెక్టరు సంయుక్త విచారణకు ఆదేశించారు. ఆ భూముల్లో మట్టి నమూనాలు పరీక్షలు చేయాలని ఆదేశించారు. అక్కడి భూములు పంటలు వేసేందుకు అవకాశం ఉంటేనే మేటలు తొలగించేందుకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. శనివారంనాడు మట్టి నమూనాలకు వెళ్లాల్సి ఉంది. కానీ కొంతమంది రెవెన్యూ అధికారులు అడ్డుపడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వర్షం వల్ల వెళ్లలేదని గనుల శాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం 'ఈనాడు'తో చెప్పారు. రైతుల అభ్యంతరం ప్రకారం ప్రస్తుతం ఇసుక తవ్వకాలను నిలిపివేశామని చెప్పారు.

ఇదీ పరిస్థితి..! : పట్టా భూముల పేరుతో ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలకు తెరతీసింది. గుంటూరు, కృష్ణా జిల్లాలో అనుమతులు ఉన్న రేవులతో పాటు పట్టాభూముల్లో తవ్వకాలు జరిపి ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. స్థానికంగా అంతగా ధరలు లేవు. కానీ హైదరాబాద్‌కు తరలిస్తే భారీగా గిట్టుబాటు అవుతోంది. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లోనూ ఇసుక ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఇటీవల సీఎం దీనిపై సమీఇంచి రవాణా లోడింగ్ ఛార్జీలను నిర్ణయించారు. కానీ అంతగా అమలు కావడం లేదని చెబుతున్నారు.

కృష్ణా జిల్లాలో 15 ఇసుక రేవులకు అనుమతులు ఉన్నాయి. ఈ రేవుల నుంచే తవ్వకాలు జరిపి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఉచితం కావడంతో ఎవరైనా సరే తవ్వకాలు చేయవచ్చు. కానీ అనధికారికంగా ఆయా రేవులు కొంతమంది గుప్పిట్లో ఉన్నాయి. లోడింగ్, రవాణా ఛార్జీల పేరుతో ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. 11 ప్రాంతాల్లో పట్టా భూముల్లో తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. మరో 5 ప్రాంతాల్లో డీసిల్టింగ్ రేవులకు అనుమతులు ఇచ్చారు. ఇంకా మరో 7 దరఖాస్తులు పట్టాభూముల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

గుంటూరు జిల్లాలో ఏడు రేవులకు అనుమతులు ఇచ్చారు. 19 ప్రాంతాల్లో ఓపెన్ తవ్వకాలకు డీసిల్టింగ్ పేరుతో అనుమతులు ఇచ్చారు. అంటే మొత్తం 26 రేవులకు అనుమతులు ఉన్నాయి. పట్టా భూముల్లో 15 అనుమతులు ఇచ్చారు. మరో 10 వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

సాధారణంగా పట్టాభూముల్లో ఇసుక మేటలు వరదలు వచ్చిన సమయంలో వేస్తాయి. నిబంధనల ప్రకారం పంటపొలాల్లో ఉంటేనే మేటలు తొలగించేందుకు అనుమతు ఇస్తారు.

నిబంధనల ప్రకారం ఆభూములు సారవంతమైనవై ఉండాలి. ఇసుక మేటలు తొలగించిన తర్వాత సేద్యం చేయాలి. దీనికి ధ్రువీకరణ ఉండాలి. వరదలు వచ్చిన సమయంలో ఎక్కువగా ఇసుక మేటలు వేస్తాయి.

ఇక్కడేం జరుగుతుందంటే..? : రైతులతో ఇసుక వ్యాపారులు దరఖాస్తులు చేయించి వాటిని అనుమతులుగా చూపించి రవాణా చేస్తున్నారు. అయినా నిబంధనల ప్రకారం ఇసుక జిల్లా సరిహద్దులు దాటకూడదు. కానీ జాతీయ రహదారిపై దర్జాగా రవాణా చేస్తున్నారు. పట్టా భూమల అనుమతులు తీసుకొని పక్కనే ఉన్న నదుల్లోనూ తవ్వకాలు జరుపుతున్నారు. కృష్ణా నదిలో లంక భూములు ఎక్కువగా ఉన్నాయి. ఈభూముల్లో అరటి, మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేస్తుంటారు. ఇవి సీజన్‌లో నే సాగు చేస్తారు. అయితే ఎక్కువగా ఇసుక ఉన్న ప్రాంతాల్లో భూములు సారవంతంగా ఉండవు. వాటిని సేద్యం చేయలేని పరిస్థితి. అయినా అనుమతులు పొందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో తోట్లవల్లూరు, పమిడి ముక్కల, చల్లపల్లి మండలాల్లో ఇలాంటి అనుమతులు ఎక్కువగా ఇచ్చారు. లంకభూముల నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుక మేటల పేరుతో ఇసుక మాఫియా తవ్వకాలు జరపడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు జరపడం వల్ల పక్కనే ఉన్న పొలాలు కోతకు గురవుతాయని చెబుతున్నారు.

నిబంధనల ప్రకారమే..! : తోట్ల వల్లూరు మండలంలో రెవెన్యూ అధికారులు నిరభ్యంతర పత్రం ఇచ్చారని, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అనుమతులు ఇచ్చామని గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం వివరణ ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులతో తనిఖీ చేసి మట్టి నమూనాలు పరిశీలించనున్నామని సారవంతమైన భూములుగా ధ్రువీకరిస్తేనే అనుమతులు ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం నిలిపివేశామని చెప్పారు.

సహకారం.. సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోవడంతో సమస్య మళ్లీ మొదటి కొచ్చింది. దీన్ని నివారించేందుకు దాదాపు ఆరేళ్ల క్రితం క్లస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పంచాయతీల ఆదాయాలను దృష్టిలో ఉంచుకొని మూడు నుంచి ఆరు గ్రామ పంచాయతీలను ఒక కస్టర్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలోని 970 గ్రామ పంచాయతీలు 516 క్లస్టర్లుగా ఉన్నాయి. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో కార్యదర్శి ఉండాల్సి ఉండాలి. దాదాపు 170 కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 516 క్లస్టర్లలో 224 గ్రేడ్-1, 139 గ్రేడ్-2, 142 గ్రేడ్-3, 11 గ్రేడ్-4 క్లస్టర్‌గా విభజించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-3 వరకూ కార్యదర్శులను నిబంధనల మేరకు నేరుగా నియమించే అవకాశం లేదు. కేవలం గ్రేడ్-4కు సంబధించిన ఖాళీలను మాత్రమే భర్తీ చేసే అవకాశం ఉంటుంది. గ్రేడ్-4 కింద కేవలం 11 క్లస్టర్లు మాత్రమే ఉండటంతో వాటిలో నియమించిన వారిని మిగిలిన గ్రేడ్‌లకు సర్దుబాటు చేయడం సాధ్యమయ్యే విషయం కాదు. దీంతో 505 క్లస్టర్లలో కార్యదర్శుల ఖాళీల భర్తీ సాధ్యపడని అంశంగా మారింది. ఉన్న కార్యదర్శులే ఇతర క్లసర్లకు ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఒక్కో క్లస్టర్ కింద ఉండే మూడు నుంచి ఆరు గ్రామ పంచాయతీల పర్యవేక్షణే కార్యదర్శికి తలకుమించిన భారం అవుతోంది. దీనికి తోడు మరో క్లస్టర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యత అంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కార్యదర్శుల కొరతే కాకుండా... ఉన్న వారిపై పడుతున్న అదనపు భారంతో పరిపాలన పరమైన ఇబ్బందులే కాకుండా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏ పంచాయతీలో ఎప్పుడుంటారో తెలియని కార్యదర్శి కారణంగా స్థానికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది. ఇక పంచాయతీల్లో పారిశుద్ధ్యం, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, ఇళ్ల పన్నుల వసూలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు నిమిత్తం ఏర్పాటు చేసే గ్రామ సభలు తదితర అంశాల్లో పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. విషజ్వరాలు వంటి అంటువ్యాధులు ఒక్కసారిగా గ్రామాల్లో విజృంభిస్తే ఏంచేయాలో పాలు పోని పరిస్థితి. ఇలా అస్తవ్యస్తంగా తయారైన పంచాయతీల పరిపాలనకు పరిపుష్టి కల్పించాలన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ ఇటీవల పంచాయతీరాజ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో క్లస్టర్ల పునర్విభజన నిర్ణయం తీసుకోవడంతో ఆ దిశగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

650కు పైగా క్లస్టర్లకు అవకాశం : క్లస్టర్ల పునర్విభనకు సంబధించి ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల ప్రకారం జిల్లాలో దాదాపు 650కు పైగా క్లస్టర్లు ఏర్పడే అవకాశం ఉంది. ఐదు వేల జనాభా లేదా రూ.50 లక్షల ఆదాయం ఉన్న పంచాయతీలను ఏ గ్రేడ్, 3 వేల నుంచి 5 వేల జనాభా లేదా రూ.30 లక్షల ఆదాయం ఉన్న పంచాయతీలను బి గ్రేడ్‌గా, మిగిలిన పంచాయతీలను సీ గ్రేడ్ క్లస్టర్లుగా నిర్ణయిస్తారు. ఈ ప్రామాణికాల ప్రకారం 110 ఏ గ్రేడ్, 180 బీ గ్రేడ్, 360 సీ గ్రేడ్ క్లస్టర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఏ, బి గ్రేడ్ క్లస్టర్ల కిందకు వచ్చే పంచాయతీలన్నీ ఏక పంచాయతీలుగానే ఉండే అవకాశం ఏర్పడవచ్చు. ఇక సీ గ్రేడ్‌లోకి వచ్చే 360 క్లస్టర్లలో నిబంధనలకు అనుగుణంగా రెండు మూడు పంచాయతీలు ఉండవచ్చు. వీటిల్లో నేరుగా కార్యదర్శుల నియామకాలు చేపట్టే అవకాశాలున్నాయి. క్లస్టర్ల పునర్విభన వల్ల గతంలో కేవలం గ్రేడ్-4 ఉన్న 11 క్లస్టర్లు లోనే నియామకం చేపట్టాలనే నిబంధన నుంచి వెసులుబాటు లభించనుంది. తద్వారా పంచాయతీల్లో మెరుగైన పరిపాలనకు ఆస్కారం ఏర్పడనుంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 88, రిటైల్ ధర - 103, చికెన్ విత్ స్కిన్ -144, చికెన్ స్కిన్‌లెస్ - 170
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర - 95, 103, 114 చికెన్ విత్ స్కిన్- 184, చికెన్ స్కిన్‌లెస్- 194

నెక్ కోడిగ్రుడ్ల ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59 పైII. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

మేరు (దర్జీ) అవివాహితులకు సువర్ణావకాశం

నేడు ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఉచిత రిజిస్ట్రేషన్ కార్యక్రమం

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఆధ్వర్యంలో మేరు (దర్జీ) అవివాహితులైన యువతీ యువకుల కోసం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. దీని ద్వారా వివాహ సంబంధాలను చూసుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఆసక్తిగల యువతీ యువకులు, తల్లిదండ్రులు వధూవరుల వివరాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవడం కోసం ఈరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ దిగువ చిరునామాలో సంప్రదించవచ్చు. **ఆర్.కె. టైలర్స్,** డా. శరత్‌బాబు ఆసుపత్రి ఎదురుగా, కె.ఎల్.రావు నగర్ (చిట్టినగర్), విజయవాడ. ఫోన్ నెంబరు 80080 03509, 91000 58128, 0866 - 2494979.

వరుడు లేక వధువులకు సంబంధించిన కార్డు సైజు ఫొటో మరియు గుర్తింపు కార్డు (ఆధార్/ఓటర్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్టు) తప్పక వెంట తీసుకురావాలి.

రేపటి నుంచి 'విందాం.. నేర్చుకుందాం'

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 21 నుంచి రేడియో ద్వారా 'విందాం..నేర్చుకుందాం' కార్యక్రమం ప్రారంభిస్తూ షెడ్యూల్‌ను సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభించి దాదాపు రెండున్నర నెలలు తర్వాత మళ్లీ రేడియో పాఠాలు పిల్లలకు అందనున్నాయి. ఈనెల 21 నుంచి నవంబరు 21 వరకు మూడు నెలల పాటు కార్యక్రమం నిర్వహించటానికి రోజువారీ షెడ్యూల్ విడుదల చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 11గంటల నుంచి 11.30 గంటల వరకూ కార్యక్రమం ప్రసారమవుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రేడియోలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, రేడియోలు లేకపోతే పాఠశాలల గ్రాంటు నుంచి కొనుగోలు చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

ఒప్పందం అమలు చేస్తారా..లేదా..?

పాలకవర్గం మార్పుపై స్పష్టత ఇవ్వాలంటూ ఆందోళన

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పురపాలక సంఘం పాలకవర్గం మార్పు అంశం మరోసారి ఆందోళనకు దారితీసింది. ఒప్పందం మేరకు ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ల పదవుల మార్పు విషయంలో స్పష్టత ఇవ్వాలంటూ మద్దతుదార్లు సమన్వయ కమిటీ ఎదుట నిరసన వ్యక్తం చేయటం చర్చనీయాంశమైంది. స్థానిక శాంతినగర్‌లోని మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు నివాస గృహంలో శనివారం తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఒకటో వార్డు కౌన్సిలర్ మోదుగు రాజకుమారి మద్దతుదారులు పెద్దసంఖ్యలో స్వామిదాసు ఇంటికి చేరుకున్నారు. మహిళలు, యువకులు సమన్వయ కమిటీ ఎదుట బైఠాయించి అప్పట్లో చేసుకున్న రెండున్నరేళ్ల ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ పదవుల మార్పు విషయమై స్పష్టమైన ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ఒకానొక సందర్భంలో ఛైర్‌పర్సన్ పదవి ఆశావహురాలైన రాజకుమారి మద్దతుదారులకు, సమన్వయ కమిటీ నాయకుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. రెండున్నరేళ్ల ఒప్పందాన్ని అమలు చేయటానికి మీకు ఇబ్బంది ఏమిటంటూ నిలదీశారు. అదే సమయంలో నలుగురు యువకులు పెట్రోల్ డబ్బాలతో సమావేశం వద్దకు వచ్చి హల్‌చల్ చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. పదవుల మార్పు విషయాన్ని ఎంపీ కేశినేని నానితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా తమకు ఒకరితో పనిలేదని, సమన్వయ కమిటీ సమావేశంలోనే చర్చించి తీర్మానం చేయాలని పట్టుబట్టారు. సమన్వయ కమిటీలో సభ్యులుగా లేనివారు బయటకు వెళ్తే చర్చిస్తామని ఏఎంసీ ఛైర్మన్ తాళ్లూరి రామారావు స్పష్టం చేయటంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గద్దె వెంకటరమణ కలగజేసుకుని ఇష్టం వచ్చినట్లు చేయటానికి మీకు పదవులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్వామిదాసు కలగజేసుకుని ఆందోళనకారుల ఎదుట ఎంపీ కేశినేనికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. ఇదివరకే తాను ఎంపీ, పలువురు నాయకులతో కలిసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కొంత కాలం నిరీక్షించమని చెప్పిన విషయాన్ని స్వామిదాసు వారికి తెలిపారు. ఈనెల 27న జరిగే సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు ఓపిక పట్టాలని చెప్పటంతో ఆందోళన విరమించారు.



సర్దిచెబుతున్న నాయకులు



పెట్రోల్ డబ్బాలతో వచ్చిన యువకులు

అందుబాటులో ఉంటేనే సత్వర న్యాయం: ఎస్పీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ శాఖ ప్రజలకు అందుబాటులో ఉంటేనే వారికి సత్వర న్యాయం చేకూర్చే అవకాశం ఉంటుందని ఎస్పీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి దూరంగా ఉండే వారి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో పశ్చిమ కృష్ణా ప్రాంతానికి చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాఖాపరమైన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజా భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్య కూడళ్లలో ప్రజలు, ఒంటరిగా వెళ్లే మహిళలు, పాదచారులు, వ్యాపారులను నిఘా కెమెరా పరిధిలోకి తీసుకురావడం ద్వారా ఏదైనా అవాంఛనీయ పరిస్థితుల్లో వారికి సత్వర రక్షణ కల్పించే వెసులుబాటు దక్కుతుందన్నారు. ర్యాగింగ్ వంటి అరాచక కార్యక్రమాలను అరికట్టే క్రమంలో విద్యాసంస్థల్లోనూ నిఘా కెమెరాల ఏర్పాటుకు సూచనలిచ్చినట్టు తెలిపారు. ప్రధాన పట్టణాల్లో అమలు చేస్తున్న లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను సద్వినియోగం చేసుకొని చోరీల నియంత్రణకు సహకరించాలన్నారు. ప్రతి శనివారం విజయవాడలో తాను అందుబాటులో ఉంటానని, ఏవైనా సమస్యల పరిష్కారం కోసం నందిగామ, నూజివీడు సబ్ డివిజన్‌ల పరిధిలోని వారు తనను కలవవచ్చని స్పష్టంచేశారు.



ప్రజల ఫిర్యాదులు వింటున్న ఎస్పీ త్రిపాఠి

పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్రమే భరించాలి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అఖిలపక్ష నాయకుల వినతిపత్రం

సూర్యారావుపేట (విజయవాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే బేషరతుగా భరించాలని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి కోరింది. శనివారం ఉదయం మహాత్మాగాంధీ రోడ్డులోని ఒక హోటల్‌లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (జలవనరులు) ఛైర్మన్ హుకుం సింగ్ ఇతర సభ్యులను కృష్ణాడెల్టా పరిరక్షణ సమితి కన్వీనర్ కొలనుకొండ శివాజీ ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు కలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు సహా పలు అంశాలపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నిర్మాణ బాధ్యతను అప్పగించినట్లు కేంద్రం చెబుతోందని అయితే 2010-11 ప్రాజెక్టు అంచనాల ప్రకారం రూ.16,010.45 కోట్లు మాత్రమే భరిస్తామనటం సరికాదన్నారు. ఐదేళ్ల కాల వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అప్పుగా పరిగణిస్తామని షరతులు విధించటాన్ని ఖండించారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో 25 శాతం కూడా నీరు చేరలేదని ఈ పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి గోదావరి జలాలను వినియోగించుకోవటం తప్ప గత్యంతరం లేదన్నారు. గంగానది ప్రక్షాళనకు రూ.20వేల కోట్లు మంజూరు చేసిన కేంద్రం, విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి తగిన విధంగా నిధులు మంజూరు చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. అమరావతి నుంచి మురుగునీరు కృష్ణా నదిలో కలవకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను, నదిఘాట్లను ఏర్పాటు చేయాలని కొలనుకొండ శివాజీ తదితర అఖిల పక్ష నాయకులు కోరారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మల్లాది విష్ణు, కాంగ్రెస్ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, రైతు సంఘం నాయకులు వై. కేశవరావు, యలమంద రావు, అల్లం రాజేష్ పాల్గొన్నారు.

కేజీబీవీకి జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారం



పెదకొమిరలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

పెదకొమిర(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెదకొమిర కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం జాతీయ స్వచ్ఛ విద్యాలయం పురస్కారానికి ఎంపికైంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నుంచి పురస్కారం కింద కేజీబీవీకి రూ.50 వేల నజరానా అందజేస్తారు. సెప్టెంబరు ఒకటిన దిల్లీలో నిర్వహించే వేడుకలో ఈ పురస్కారం అందజేస్తారని ప్రత్యేకాధికారిణి ఎం.శ్యామల శనివారం తెలిపారు. 2016-17 విద్యా సంవత్సరానికి సంబంధించి పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై పరిశీలన చేసిన అధికారుల బృందం పెదకొమిర కేజీబీవీని జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపిక చేశారు. జిల్లాలో తొలిగా స్వచ్ఛ విద్యాలయ పురస్కారం అందుకున్న ఏకైన విద్యాలయం ఇదే.

మట్టి గణపతికే.. మా మొదటి ప్రణామం

ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సేవాసంస్థల కృషి

తిరువూరు, న్యూస్‌టుడే

వినాయక ఉత్సవాలను కులమతాలకు అతీతంగా నిర్వహించటం ఆనవాయితీ. ఈనెల 25న గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే తయారు చేసిన ప్రతిమలను విక్రయానికి మార్కెట్‌లో సిద్ధం చేశారు. తొమ్మిది రోజుల పాటు వేడుకలను వైభవంగా నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మండపాలను ఏర్పాటు చేసే స్థలాల ఎంపిక కొలిక్కి వచ్చింది. మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ పలు సేవా సంస్థలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న చిన్నపాటి ప్రతిమలు




రసాయనాలతో అనర్థం...

– జె.శిరీష, డిగ్రీ విద్యార్థిని



మట్టి విగ్రహాలను పూజించే వారి సంఖ్య పెరగాలి. రసాయనాలతో కూడిన విగ్రహాలను నిమజ్జనం చేస్తుండటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకుని మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహంలో జిప్సమ్, సల్ఫర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం ఉండటంతో నీటిలో సులువుగా కరగవు. నీరు భూమిలో ఇంకటానికి ఇవి అడ్డుపడతాయి. విగ్రహాలకు వేసే రంగుల్లో కాడ్మియం, సిలికాన్, పాదరసం, సీసం, కర్బనం, మాలిబ్డినం, ఆర్సినిక్, క్రోమియం వంటి లోహాలు కలిసి ఉంటాయి. విగ్రహాలను నీటిలోనే నిమజ్జనం చేయటం జలచరాల మనుగడకు ప్రమాదకరం.


మట్టే మేలు – ఎన్.తేజ, డిగ్రీ విద్యార్థిని



సహజ రంగులను ఉపయోగించి తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణం, నీటికాలుష్యం వంటి సమస్యలు తలెత్తవని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. సహజ సిద్ధమైన రంగులు కాలుష్యరహితమైనవి. పర్యావరణానికి ఎలాంటి హాని చేయవు. ఈ రంగులతో తయారు చేసిన విగ్రహాలు సున్నితంగా, మృదువుగా వాడకానికి అనుకూలంగా ఉంటాయి. తక్కువ ధరలకే లభించటం వల్ల ఆర్థిక భారం అనిపించదు. తరలించటానికి సులువుగా ఉంటుంది. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తవు. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో మట్టి విగ్రహాల వినియోగం పెరగాల్సి ఉంది.

ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి

– వై.ప్రమీల, డిగ్రీ విద్యార్థిని



పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ప్రస్తుత వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను వినియోగించటంపై ప్రజలకు అవగాహన కల్పించటానికి మావంతు కృషి చేస్తాం. నేను మట్టితో తయారు చేసిన విగ్రహానికే పూజలు చేస్తాను. తోటివారిని కూడా అలాగే చేయమని చెబుతాను. గత కొన్నేళ్లుగా సేవాసంస్థలు, పర్యావరణ ప్రేమికులు చేస్తున్న ప్రచారంతో ప్రజల్లో కొంత మార్పు వచ్చింది. రసాయనిక విగ్రహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయటంలో పర్యావరణ శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాల్సి ఉంది.

ఆర్భాటాలతో అనర్థమే

– వై.శివపార్వతి, డిగ్రీ విద్యార్థిని



చెరువుల వద్ద నుంచి తెచ్చిన నల్లమట్టి, బంకమట్టితో చేసిన విగ్రహాలను వినియోగిస్తుండటం ఇప్పటికీ పల్లెల్లో కనిపిస్తోంది. నేను చిన్నప్పటి నుంచి మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని పుస్తకాలపై పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటాను. ఇకపై కూడా ఇదే సంప్రదాయాన్నే కొనసాగిస్తాను. ఇప్పటికే కాలుష్యం సమస్య ప్రపంచాన్ని వేధిస్తోంది. సమస్య మరింత జటిలం కాకముందే ప్రతి ఒక్కరూ మేల్కొని బాధ్యతగా వ్యవహరించాలి. ఆర్భాటాలకు వెళ్లి పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించే బదులు, మట్టితో తయారు చేసిన చిన్న విగ్రహాలను వినియోగిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

అడ్డుకట్ట పడేనా..?

తమ ప్రత్యేకతను చాటేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాల ఎత్తు, రంగుల విషయంలో పోటీపడుతుంటారు. నిర్వాహకుల అభిరుచుల మేరకు ఎక్కువ మోతాదులో రసాయనాలతో కూడిన రంగులను వినియోగిస్తూ ప్రతిమలను తయారు చేస్తున్నారు. రసాయనాలతో కూడిన విగ్రహాలతో ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. విగ్రహాల తయారీలో వినియోగించే ప్లాస్లర్ ఆఫ్ పారీస్, సిల్వర్, సియాటిక్ రంగులు, థిన్‌పాయిల్ రసాయన పదార్థాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాల నిమజ్జనం అనంతరం ఇవన్నీ నీటిలో కరిగి జలకాలుష్యానికి దోహదం చేస్తోంది. జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదంతో పాటు ఈ నీటిని తాగటం వల్ల మానవాళి వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది.

మట్టితో వినాయకుడ్ని తయారు చేస్తున్న చిన్నారులు



మట్టితో చేసిన చిన్న విగ్రహాలే మేలు

వినాయక విగ్రహాలను బంకమట్టి, పిండితో తయారు చేసి వినియోగించే వారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేసి సమీపంలోని చెరువులు, వాగులు, వ్యవసాయ భూముల్లో నిమజ్జనం చేసేవారు. దీనివల్ల భూములకు సారవంతమైన మట్టి లభించేది. మట్టి ప్రతిమలను పూజించి వ్యవసాయ భూముల్లో నిమజ్జనం చేస్తే పంటలు విస్తారంగా పండుతాయని ప్రజల నమ్మకం. విద్యార్థులు, రైతులు మట్టి ప్రతిమలనే పూజించి నిమజ్జనం చేయటం ఇప్పటికీ కొనసాగుతోంది. మట్టితో తయారు చేసిన విగ్రహాలు, ప్రతిమలు త్వరగా నీటిలో కరిగిపోవటం, ఎలాంటి రసాయనాలు లేకపోవటంతో పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మట్టి విగ్రహాలను వినియోగించటంతో పాటు తక్కువ ఎత్తు ఉన్న ప్రతిమలను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

చైతన్యం అవసరం

మట్టి విగ్రహాలను వినియోగించే విషయంలో ప్రజలు మరింత చైతన్యం కావాల్సి అవసరం ఎంతైనా ఉంది. రసాయనాలు కలిగిన విగ్రహాలను చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేయటం వల్ల ఇప్పటికే కోరలు చాచిన కాలుష్యభూతం మరింత ప్రమాదకరంగా మారే వీలుంది. స్వచ్ఛంద సేవా సంస్థలు గత కొన్నేళ్లుగా దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ సంస్థ బాధ్యతను భుజానికెత్తున్న యువత, సేవా సంస్థల ప్రతినిధులు వినాయక పర్వదినం సందర్భంగా విద్యాసంస్థలను వేదికగా చేసుకుని అవగాహన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం కొంత వరకు ఫలితాన్నిస్తోంది. మరోవైపు లయన్స్‌క్లబ్, వాసవీక్లబ్ వంటి సంస్థలు పర్వదినం రోజు మట్టి విగ్రహాలను గత కొన్నేళ్లుగా ఉచితంగా పంపిణీ చేస్తూ తమవంతు కృషి చేస్తున్నాయి. తిరువూరు మధిరరోడ్డులో గత ఐదేళ్లుగా అక్కడి యువకులు మట్టి గణనాథుడ్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లోని ప్రతి వీధిలో రెండు, మూడేసి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే సంప్రదాయం మరింత పెరిగింది.




మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు (దాచిన చిత్రం)

వేల సంఖ్యలో విగ్రహాల ఏర్పాటు

జిల్లాలోని 970 పంచాయతీలతో పాటు ఎనిమిది పురపాలక సంఘాల పరిధిలోని పట్టణాల్లో వేల సంఖ్యలో విగ్రహాలను వినియోగిస్తున్నారు. పట్టణాల్లో కనీసం 50 నుంచి 80 వరకు, పల్లెల్లో నాలుగైదు చొప్పున విగ్రహాలను ఏర్పాటు చేస్తూ పూజలు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం ఖరీదు తయారీ ఖర్చు, ఎత్తును బట్టి రూ.5 వేల నుంచి రూ.లక్ష పైబడి ధర పలుకుతున్నాయి. ఏటా విగ్రహాలకే రూ.కోట్ల ఖర్చు చేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక వాహనాలు, డప్పులు, తీన్‌మార్, కోలాటం, చెక్కభజన వంటివాటికి తక్కువలో తక్కువ రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో మట్టి విగ్రహాలను వినియోగిస్తే ఖర్చు సగానికి సగం తగ్గటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకునే వీలుంది. ఈ విగ్రహాల తయారీపై ఆధారపడి జీవించే వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించటానికి దోహదం చేయనుంది.

మృత్యువాత పడుతున్న జలచరాలు

– కె.అపర్ణ, డిగ్రీ విద్యార్థిని



మట్టితో తయారు చేసిన ప్రతిమలను పూజల అనంతరం చెరువులు కుంటల్లో నిమజ్జనం చేయటం వల్ల చేపలు, కప్పలు, పీతలు, పలు రకాల పక్షులకు ఎలాంటి ముప్పు లేకపోయింది. రసాయనిక పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయటం వల్ల నీటిలోని జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. ఈ నీళ్లు తాగిన ప్రజలు, పశుపక్ష్యాదులు వ్యాధుల బారినపడుతున్నాయి. అందుకే ఇప్పటి నుంచి అయినా మట్టి విగ్రహాలకే ప్రాధాన్యతనిచ్చి ప్రజలు కచ్చితంగా పాటించేలా నావంతు కృషి చేస్తాను.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

– సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ



రసాయన విగ్రహాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పోలీస్‌శాఖ పరంగా అవగాహన కల్పిస్తున్నాం. గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ఆర్భాటాలకు పోకుండా, మట్టి విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారు. అనుమతి కోరేందుకు వచ్చే ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఇదే విషయాన్ని చెబుతున్నాం. మట్టి విగ్రహాల వినియోగం పెంచేందుకు సేవా సంస్థలు, యువత సహకారం తీసుకుంటున్నాం. ప్రజల్లో సైతం మార్పు రావాల్సిన అవసరం ఉంది.





తిరువూరుకు చెందిన చిన్నారి శ్రీబృంద గోధుమపిండితో తయారు చేసిన గణపతి ప్రతిమ

రూ.2,097 చెల్లిస్తే ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం

గుంటూరు, విజయవాడ, కృష్ణా జిల్లాల డీఎస్పీ రామకృష్ణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అందుబాటులోకి తీసువచ్చిందని ఆయా పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు, విజయవాడ, కృష్ణా జిల్లాల హోంగార్డ్సు డీఎస్పీ రామకృష్ణ అన్నారు. శనివారం గుంటూరులోని పోలీసు కళ్యాణమండపంలో హోంగార్డ్సుకు ప్రత్యేకంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు యేడాదికి రూ. 2,097లు ప్రీమియం చెల్లించి గ్రూపు జనతా బీమా, గ్రూపు మెడికల్ బీమా పాలసీ నమోదు చేసుకోవాలన్నారు. ఆ పాలసీ నమోదు చేసుకున్న వారిలో ఎవరైనా ప్రమాదంలో మృతి చెందితే రూ. 2 లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ. లక్ష నగదు వస్తుందన్నారు. గ్రూపు మెడికల్ పాలసీ కింద ఆరోగ్య సేవలకు రూ. 50 వేలు అందిస్తారన్నారు. ప్రమాదకరమైన శస్త్రచికిత్సల సమయంలో సంక్షేమ నిధి నుంచి అదనపు నగదు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మెహర్‌బాబా, ఆర్ఐలు కృష్ణ, విజయసారధి పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన హోంగార్డులు



మాట్లాడుతున్న హోంగార్డ్సు డీఎస్పీ రామకృష్ణ

నున్న.. సౌకర్యాలు మిన్న

వేగంగా అభివృద్ధి చెందుతున్న నున్న స్థిరాస్తి వ్యాపారం

నవ్యాంధ్ర పాలనాకేంద్రమైన విజయవాడ అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకుపోతోంది. మరిన్ని కొత్త సౌకర్యాలతో నగరవాసికి కొత్త ఉత్సాహం నింపుతోంది. రహదారుల విస్తరణ, కొత్త రహదారుల అభివృద్ధి, శరవేగంగా కొనసాగుతున్న పైవంతెనల నిర్మాణం, గన్నవరం విమానశ్రాయం అంతర్జాతీయ హోదాతో విజయవాడ రూపురేఖలు మారిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పేరొందిన విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల రాకతో నున్న ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రముఖ స్థిరాస్తి వ్యాపార సంస్థలు తమ వెంచర్లను నున్న ప్రాంతంలో వేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు సొంతింటి కలను తీరుస్తున్నాయి.

విజయవాడలో ప్రధానమైన ప్రాంతాల్లో నున్న ఒకటి. విజయవాడ నుంచి నూజివీడు వెళ్లే మార్గంలో ఉన్న ఈ ప్రాంతం అతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో నగర శివారుగా ఉండే ఈ ప్రాంతం.. ప్రస్తుతం నగరంలో ఓ భాగమైపోయింది. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోంది. నున్న ప్రాంతం గుణదల ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగు రోడ్లకు చేరువలో ఉంది. రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ-విస్సన్నపేట రోడ్డు 12 కి.మీ. మేర విస్తరించనున్నారు. నవ్యాంధ్ర రాజధానిగా ఏర్పడిన తరువాత విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం విజయవాడకు వస్తున్న ప్రజలు స్థిరనివాసం ఏర్పరచుకునేందుకు నున్న ప్రాంతం వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు ఇక్కడ తమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్, త్రిబుల్ బెడ్ రూమ్ అపార్టుమెంట్లను, గేటెడ్ కమ్యూనిటీలను నిర్మిస్తున్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ నున్నకు అతి చేరువలో ఉంది.

రైల్వేస్టేషన్‌కు దగ్గరలో.. విజయవాడ రైల్వే స్టేషన్‌కు పదకొండు కిలోమీటర్ల దూరంలో నున్న ఉంది. దూరప్రాంతాలకు వెళ్లే వారు, రైలు ప్రయాణాలు చేసేవారు నున్న నుంచి అరగంటలో రైల్వే స్టేషన్‌కు చేరుకోవచ్చు. రోడ్డు రవాణా సదుపాయం మెరుగ్గా ఉండడంతో ప్రజలు నున్న ప్రాంతంలో నివాసాలు ఏర్పర్చుకునేందుకు ఆసక్తి కనబరిస్తున్నారు.

అందుబాటులో విద్యాసంస్థలు.. శ్రీచైతన్య టెక్నో స్కూలు, జయవాడ రవీంద్ర భారతి మరియు రేడియంట్ హైస్కూలు మొదలగు కార్పొరేట్ విద్యా సంస్థలు నున్నలో అందుబాటులో ఉన్నాయి.

గొల్లపూడి, రామవరప్పాడుకు దగ్గరలో.. రామవరప్పాడు నుంచి పది కిలోమీటర్లు, గొల్లపూడి నుంచి పదిహేను కిలోమీటర్ల దూరంలో నున్న ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. రామవరప్పాడు, గొల్లపూడి వెళ్లాలంటే అరగంట సమయంలో చేరుకోవచ్చు. అటు హైదరాబాద్‌కు వెళ్లాలన్నా, ఇటు వైజాగ్‌కు వెళ్లాలన్నా ఈ మార్గంలో వెళ్లిపోవచ్చు.

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఏర్పాటు.. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీని నున్న సమీపంలోని సూరంపల్లిలో ఏర్పాటు చేస్తున్నారు.

చేరువలో సాంకేతిక విద్యను అందించే కళాశాలలు.. విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. నున్న సమీపంలో అనేక ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు రానున్నాయి.. నున్న సమీపంలోని కొండపావులూరులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి తొమ్మిది శాఖల కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో నున్న ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. డబుల్, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ల నిర్మాణం జోరందుకుంది. అన్ని రకాల సదుపాయాలతో నిర్మాణాలు చేస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్లు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది ముందస్తు బుకింగ్‌లు చేసుకున్నట్లు స్థిరాస్తి వ్యాపారులు చెబుతున్నారు.















మచిలీపట్నం

'హమాలీ కార్మికుల సదస్సును జయప్రదం చేయండి'

కోనేరుసెంటరు, న్యూస్‌టుడే: హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుట్టాయిపేట సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ నేతలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామంటూ ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి దాదాపు మూడున్నరేళ్లు అవుతున్నా సమగ్ర శాసన చట్టం ఊసే ఎత్తకపోవడం కార్మికులపై వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. హమాలీ కార్మికులకు సంబంధించి ఏడు ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన విజయవాడ కేదారేశ్వరపేట మున్సిపల్ కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు అన్ని రంగాల్లోని హమాలీ కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏపీ హమాలీ, ముఠా కార్మిక ఫెడరేషన్ కోకన్వీనర్ ముజఫర్‌అహ్మద్, తూర్పు కృష్ణా కన్వీనర్, కో కన్వీనర్‌లు డి. మునియ్య, సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న శిర్విశెట్టి సత్యనారాయణ

పోర్టురోడ్డు, న్యూస్‌టుడే: విలువలతో కూడిన విద్య అనేది ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని ఎస్ఎస్ఆర్ కళాశాల ఛైర్మన్ శిర్విశెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం కళాశాలలో స్వాగతోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి శిర్విశెట్టి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కళాశాల జీవితం అనేది ఎంతో కీలకమని, ఇక్కడ నేర్చుకున్న అనుభవాలే వారికి భవిష్యత్తులో జీవన పాఠాలుగా ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా కళాశాలలో సీనియర్లు, జూనియర్లు కలిసి సమైక్యరాగం ఆలపించాలని, అప్పుడే కళాశాల జీవితం ఆనందమయంగా సాగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతీయువకులంతా ఉత్సాహంగా సినీ గేయాలకు తమ నృత్యాలతో సందడి చేసి తోటి విద్యార్థులను ఉర్రూతలూగించారు. అనంతరం విద్యార్థులు ర్యాంప్ వాక్‌తో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, డైరెక్టర్ నాగేంద్రకుమార్, డా. పద్మశ్రీ, శిర్విశెట్టి భాస్కర్, పవన్‌కుమార్, దీప్తి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో..

కృష్ణా విశ్వవిద్యాలయం ఎంఏ తెలుగు విద్యార్థుల స్వాగతోత్సవం సందర్భంగా తెలుగు విభాగాధిపతి వరుణకుమారి విద్యార్థులంతా క్రమశిక్షణను అలవరచుకుని ఉత్తమ బాటలో పయనించాలని సూచించారు. అనంతరం వరుణకుమారిని సత్కరించారు. అధ్యాపకులు ఆనందకుమార్ బెనర్జీ, కృష్ణాడిటెక్టివ్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సినీ గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఫొటోగ్రఫీతో వేలాదిమందికి ఉపాధి

గొడుగుపేట,న్యూస్‌టుడే: ఫొటోగ్రఫీ వేలాదిమందికి ఉపాధి కల్పిస్తోందని మున్సిపల్ ఛైర్మన్ బాబాప్రసాద్ అన్నారు. పట్టణంలోని అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో మచిలీపట్నం డివిజన్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బాబాప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీకి ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని అన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని చెప్పారు. తొలుత కెమెరా రూపకర్త జాక్వస్‌మెండేడాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ బత్తిన దాసు, అబ్దుల్‌అజీమ్, కొండ్రు భాస్కరరావు తదితరుల ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా ఫొటోగ్రాఫర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, వృద్ధాశ్రమాల్లో వితరణలు చేపట్టారు. సంఘ అధ్యక్షుడు షేక్‌మస్తాన్‌వలీ, జి.సుధీర్, ఎంహెచ్ఎస్ ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కెమెరా రూపకర్తకు నివాళులర్పిస్తున్న ఛైర్మన్ బాబాప్రసాద్ తదితరులు

పారిశుద్ధ్య పనుల తనిఖీ

గొడుగుపేట,న్యూస్‌టుడే: పట్టణంలోని 14వ వార్డులో చేపట్టిన పారిశుద్ధ్య పనులను మున్సిపల్ ఛైర్మన్ బాబాప్రసాద్ తనిఖీ చేశారు. వార్డులోని ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతివార్డు పరిశుభ్రంగా ఉండాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. దింటకుర్తి సుధాకర్, అబ్దుల్‌అజీమ్, కేశినేని జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేకుంటే చర్యలు

మచిలీపట్నం క్రైం: మచిలీపట్నం సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ వైకుంఠరావు హెచ్చరించారు. ఆయన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాటు సారా విక్రయదారులతో పాటు గొలుసు దుకాణ నిర్వాహకుల పైనా కఠిన చర్యలు తప్పవన్నారు. సర్కిల్ పరిధిలో వీటిని నివారించేందుకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశామని చెబుతూ నిబంధనల అతిక్రమణకు సంబంధించి సమాచారం ఎవరు తెలిపినా సత్వర చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించండి

భాస్కరపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్ఐఓ ఆనందబాబు ఆకాంక్షించారు. శనివారం పట్టణానికి వచ్చిన ఆయన స్టార్ కళాశాలను సందర్శించారు. కళాశాల విద్యార్థులు 2016-17కుగాను ఇంటర్మీడియట్‌లో 98.75 శాతంతో ఉత్తమ ప్రతిభ కనబరిచారని అభినందించారు. చక్కగా చదువుకుని తమకు, చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది ఆనందబాబుని సత్కరించారు.

మచిలీపట్నం

జీఎస్టీపై అవగాహన అవసరం

భాస్కరపురం, న్యూస్‌టుడే: జీఎస్టీపై అవగాహన అవసరమని జీఎస్టీ స్టేట్ ట్యాక్సు కమిషనర్ వి.రఘునాథ్ తెలిపారు. పట్టణంలోని మెహర్‌బాబా ఆడిటోరియంలో రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమూరి కృష్ణాజీరావు ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైస్ మిల్లర్లు, వ్యాపారులకు, అకౌంటెంట్లకు ఏర్పాటు చేసిన సదస్సులో రైస్ మిల్లర్లు, రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ వారు ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్ను చెల్లింపు వివరాలు తెలిపారు. జీఎస్టీలో నూతనంగా వచ్చిన వేబిల్లు, బిల్లు పుస్తకాల ముద్రణ తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సెంట్రల్ ట్యాక్స్, స్టేట్ ట్యాక్సు అధికారులు ఎంకే రమణేశ్వరరావు, షేక్‌షహనాజ్ బేగం, ఎం.సుధాకర్, ఏబీ హర్షవర్ధన్, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం అధికారులను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సభ్యులు అన్నే శ్రీనివాసబాబు, పాలకుర్తి పాండురంగారావు, తాడేపల్లి మెహర్‌బాబా, మాదాల వెంకటేశ్వరరావు, జి.ఈశ్వరరాజు, ట్యాక్సు కన్సల్‌టెంట్లు, అకౌంటెంట్లు, వ్యాపారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ట్యాక్సు కమిషనర్ రఘునాథ్

అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలి


సావనీర్ ఆవిష్కరిస్తున్న పీపీ కొండయ్య తదితరులు

గొడుగుపేట, న్యూస్‌టుడే: ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం, ప్రజలు కలిసి కృషి చేయాలని జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎం కొండయ్య అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సదస్సును జిల్లా పీపుల్స్ మానిటరింగ్, కమిటీ కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మలకాపట్నంలో శనివారం నిర్వహించారు. ఇందులో 17 లక్ష్యాలు, 169 ఉపలక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో ముఖ్యంగా పేదరికాన్ని నిర్మూలించడం, అందరికీ ఆరోగ్యం, సమాన విద్యావకాశాలు తదితర అంశాలను వివరించారు. పీఎంసీ కన్వీనర్ టి.మధుసూదనరావు మాట్లాడతూ ప్రపంచ ప్రజల అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఐక్యరాజ్య సమితి 2015లో ప్రకటించిందన్నారు. 2030లోగా అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు 2030 సావనీర్‌ను కొండయ్య ఆవిష్కరించారు. కలపాల రాజేష్, అంబటి రాజేంద్ర, పుట్టి ఏసురత్నం, సూర్యకుమారి, యువతీ యువకులు పాల్గొన్నారు.


రైతుకు 1బి పత్రాన్ని అందజేస్తున్న ఉప ఎంపీపీ, గోపు తదితరులు

'తెదేపా రైతుపక్షపాతి'

తాళ్లపాలెం(పోర్టురోడ్డు) : తెదేపా ప్రభుత్వం రైతుపక్షపాతి అని ఉప ఎంపీపీ ఊసా వెంకట సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీలో శనివారం మీ ఇంటికీ మీ భూమి గ్రామసభను నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం తహసీల్దారు నారదముని కార్యక్రమం ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. గ్రామసభకు సంబంధించి 42 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. అనంతరం రైతులకు 1బి పత్రాలను అందజేశారు.

అవీ ఇవీ..

వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మచిలీపట్నం మాలమహానాడు అధ్యక్షుడు కొంగ్రు శామ్యూల్ డిమాండ్ చేశారు. శుభ్రత లేదని వ్యాఖ్యానించడం దళితుల పట్ల చిన్నచూపుతో ఉండడమేనని అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

నటుడు సత్యం మృతికి సంతాపం

పట్టణానికి చెందిన నటుడు ముద్రగడ సత్యం శనివారం మరణించినట్లుగా మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. సంఘ అధ్యక్షుడు చలమలశెట్టి గాంధీ మాట్లాడుతూ పూలరంగడు అనే సాంఘిక నాటకంతో పరిచయమైన సత్యం జీవనతరంగాలు, ప్రేమకుసంకెళ్లు, ప్రేమ పూజారులు, పెళ్లిచూపులు తదితర నాటకాలలో అందరికీ చేరువయ్యారని అన్నారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టిగా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారని తెలిపారు. సంఘ నాయకులు పలువురు సత్యం సేవలను కొనియాడారు. సభ్యులు వీరాస్వామి, పూర్ణచంద్రరావు, రాజేశ్వరరావు, ఏడుకొండలు, నారాయణరావు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొని తమ సంతాపం వ్యక్తం చేశారు.

– భాస్కరపురం, న్యూస్‌టుడే





జనరల్ స్టడీస్
భారతదేశ చరిత్ర

ప్రతిభ

భారత జాతీయోద్యమం

'దేశ భక్తుల్లో రాజు'గా పేరుగాంచింది...?



- రచయిత
బి. నాగరాజు
అసిస్టెంట్ ప్రొఫెసర్

1. భారతదేశంలో ఏర్పడిన తొలి రాజకీయ సంస్థ ఏది?
1) అకడెమిక్ అసోసియేషన్
2) బెంగాల్ భూస్వాముల సంఘం
3) బెంగాల్ బ్రిటిష్ ఇండియా సంఘం
4) బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్

2. అకడెమిక్ అసోసియేషన్‌ను స్థాపించింది ఎవరు?
1) హెన్రీ డిరోజియో 2) చార్లెస్ డికెన్స్
3) థియోడర్ డికెన్స్ 4) సురేంద్రనాథ్ బెనర్జీ

3. కింది సంస్థలను, వాటి స్థాపక సంవత్సరాలతో జత చేయండి.
I) బెంగాల్ బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ A) 1870
II) బొంబాయి అసోసియేషన్ B) 1853
III) మద్రాస్ నేటివ్ అసోసియేషన్ C) 1852
IV) పూనా సార్వజనిక సభ D) 1851
1) I-A, II-B, III-C, IV-D
2) I-B, II-A, III-D, IV-C
3) I-C, II-B, III-D, IV-A
4) I-D, II-C, III-B, IV-A

4. లండన్ ఇండియన్ అసోసియేషన్‌ను స్థాపించింది ఎవరు?
1) సురేంద్రనాథ్ బెనర్జీ 2) దాదాభాయ్ నౌరోజీ
3) ఎం.జి. రనడే 4) విలియం వెడ్డర్‌బర్న్

5. 1876 లో సురేంద్రనాథ్ బెనర్జీ ఎవరితో కలిసి ఇండియన్ అసోసియేషన్‌ను స్థాపించారు?
1) జి.వి. జోషి 2) ఆనందమోహన్ బోస్
3) శిశిర్‌కుమార్ ఘోష్ 4) కె.టి. తెలాంగ్

6. 1884 లో మద్రాస్ మహాజన సభను స్థాపించింది ఎవరు?
1) సుబ్రహ్మణ్య అయ్యర్ 2) సుబ్రహ్మణ్య భారతి
3) వాంఛి అయ్యర్ 4) గాజుల లక్ష్మీనరసు

7. ఆధునిక జాతీయతాభావ పితామహుడిగా ప్రసిద్ధిగాంచిన వ్యక్తి ఎవరు?
1) గాంధీజీ 2) స్వామి దయానంద
3) స్వామి వివేకానంద 4) దాదాభాయ్ నౌరోజీ

8. 'ఇల్బర్ట్ బిల్లు భారతీయులకు నేర్పిన గుణపాఠాన్ని విద్యావంతులైన భారతీయులెవరూ మర్చిపోరు' అని వ్యాఖ్యానించింది ఎవరు?
1) క్రిస్టోదాస్ పాల్ 2) సురేంద్రనాథ్ బెనర్జీ
3) దాదాభాయ్ నౌరోజీ 4) థాంప్సన్ గారట్

9. 1883 లో కలకత్తాలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించింది ఎవరు?
1) ఎ.ఒ. హ్యూమ్ 2) గోపాలకృష్ణ గోఖలే
3) సురేంద్రనాథ్ బెనర్జీ 4) పండిత అయోధ్యనాథ్

10. భారత జాతీయ కాంగ్రెస్‌కు సంబంధించి సరికానిది?
1) రక్షక కవాట సిద్ధాంతాన్ని అమలు చేయడానికి హ్యూమ్ కాంగ్రెస్‌ను స్థాపించారు.
2) కాంగ్రెస్‌ను అల్ప సంఖ్యాక వర్గాల సంస్థగా విలియం వెడ్డర్‌బర్న్ వ్యాఖ్యానించారు.
3) కాంగ్రెస్ అంతాన్ని చూడటమే తన ధ్యేయం అని లార్డ్ కర్జన్ వ్యాఖ్యానించారు.
4) భారత జాతీయ కాంగ్రెస్ తొలి కార్యదర్శిగా ఎ.ఒ. హ్యూమ్ వ్యవహరించారు.

11. తొలి జాతీయ కాంగ్రెస్ సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య?
1) 76 2) 78 3) 72 4) 79

12. భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర పుస్తక రచయిత?
1) ఎ.ఒ. హ్యూమ్ 2) డబ్ల్యు.సి. బెనర్జీ
3) భోగరాజు పట్టాభి సీతారామయ్య
4) విలియం వెడ్డర్‌బర్న్

13. కింది అంశాలను జతపరచండి.
I) జార్జి యూలె A) మద్రాస్
II) బద్రుద్దీన్ త్యాబ్జీ B) అలహాబాద్
III) సరోజినీ నాయుడు C) నాగ్‌పూర్
IV) పి. ఆనందాచార్యులు D) కాన్పూర్
1) I-A, II-B, III-C, IV-D
2) I-B, II-A, III-D, IV-C
3) I-B, II-A, III-C, IV-D
4) I-D, II-B, III-A, IV-C

✪ వందేమాతరం ఉద్యమానికి సంబంధించి కిందివాటిలో సరైన అంశం ఏది?
ఎ) ఆంధ్రాలో కాకినాడ బాంబు కేసు సంఘటన జరిగింది.
బి) తమిళనాడులో చిదంబరం పిళ్లై స్వదేశీ స్టీమ్ నావిగేషన్ కంపెనీని స్థాపించారు.
సి) ఆంధ్రాలో బిపిన్ చంద్రపాల్ ఉద్యమాన్ని ప్రచారం చేశారు.
డి) పి.సి. రే బెంగాల్ స్వదేశీ కెమికల్ స్టోర్స్ స్థాపించారు.
1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
3) బి, సి, డి సరైనవి 4) అన్నీ సరైనవి
జవాబు: 3

14. 'ఇండియా' అనే పత్రికను ప్రారంభించింది ఎవరు?
1) విలియం వెడ్డర్‌బర్న్ 2) జార్జి యూలె
3) దాదాభాయ్ నౌరోజీ 4) చార్లెస్ బ్రాడ్‌లా

15. 1924 లో గాంధీజీ అధ్యక్షత వహించిన కాంగ్రెస్ సమావేశం ఏది?
1) వార్ధా 2) గయ 3) కలకత్తా 4) బెల్గాం

16. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నదెవరు?
1) గాంధీజీ 2) నెహ్రూ
3) జె.బి. కృపలానీ
4) భోగరాజు పట్టాభి సీతారామయ్య

17. మితవాద యుగానికి సంబంధించి కిందివాటిలో సరైన అంశం?
1) గోపాలకృష్ణ గోఖలే మితవాద నాయకుడు.
2) ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన విధానాలు అనుసరించారు.
3) వెల్బీ కమిషన్‌ను నియమించారు.
4) రొట్టె కోసం పోరాడిన మితవాదులు రాళ్లు కూడా సంపాదించ లేకపోయారని తిలక్ విమర్శించారు.

18. బ్రిటిష్ పాలనను భారతదేశం మీద నిరంతరం సాగుతున్న విదేశీ దండయాత్రగా వ్యాఖ్యానించింది ఎవరు?
1) దాదాభాయ్ నౌరోజీ 2) బాలగంగాధర తిలక్
3) లాలాలజపతిరాయ్ 4) బిపిన్ చంద్రపాల్

19. వాయిస్ ఆఫ్ ఇండియా పత్రికను, భారత తంతి సమాచార సంఘాన్ని స్థాపించింది ఎవరు?
1) దాదాభాయ్ నౌరోజీ 2) ఎ.ఒ. హ్యూమ్
3) గోపాలకృష్ణ గోఖలే 4) ఆర్.సి. దత్

20. భారత జాతీయ కాంగ్రెస్‌కు ఆ పేరు సూచించింది ఎవరు?
1) ఎ.ఒ. హ్యూమ్ 2) డబ్ల్యు.సి. బెనర్జీ
3) దాదాభాయ్ నౌరోజీ 4) గోపాలకృష్ణ గోఖలే

21. బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన తొలి భారతీయుడిగా పేరొందిన దాదాభాయ్ నౌరోజీ ఏ నియోజకవర్గం నుంచి గెలిచారు?
1) సెంట్రల్ ప్రావిన్సెస్ 2) సెంట్రల్ ఫిన్స్‌బరి
3) సెంట్రల్ బ్రిస్టల్ 4) ఏదీకాదు

22. 'స్వదేశీ' అనే పదాన్ని తొలిసారిగా తీర్మానించింది, ప్రతిపాదించింది ఎవరు?
1) అరవిందో ఘోష్ 2) స్వామి వివేకానంద
3) దాదాభాయ్ నౌరోజీ
4) స్వామి దయానంద సరస్వతి

23. 1892 భారత కౌన్సిళ్ల చట్టాన్ని 'బిక్షగాడి జీవితం లాంటిది' అని వ్యాఖ్యానించింది ఎవరు?
1) దాదాభాయ్ నౌరోజీ 2) సురేంద్రనాథ్ బెనర్జీ
3) గోపాలకృష్ణ గోఖలే 4) ఫిరోజ్ షా మెహతా

24. 'ఎ నేషన్ ఇన్ మేకింగ్' అనే గ్రంథ రచయిత ఎవరు?
1) సురేంద్రనాథ్ బెనర్జీ 2) బిపిన్ చంద్రపాల్
3) లాలాలజపతిరాయ్ 4) దాదాభాయ్ నౌరోజీ

25. మహారాష్ట్ర సోక్రటీస్‌గా బిరుదు పొందిన వ్యక్తి ఎవరు?
1) నానా ఫడ్నవీస్ 2) తిలక్
3) ఫిరోజ్ షా మెహతా 4) గోపాలకృష్ణ గోఖలే

26. రాజద్రోహ నేరంపై అరెస్ట్ అయిన తొలి భారతీయుడు ఎవరు?
1) తిలక్ 2) లాలాలజపతిరాయ్
3) భగత్‌సింగ్ 4) చంద్రశేఖర్ ఆజాద్



27. 1905 లో 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' అనే సంస్థను స్థాపించింది ఎవరు?
1) గోపాలకృష్ణ గోఖలే 2) తిలక్
3) భగత్‌సింగ్ 4) సురేంద్రనాథ్ బెనర్జీ

28. గోపాలకృష్ణ గోఖలేను 'భారతదేశపు వజ్రం'గా పేర్కొన్నది ఎవరు?
1) గాంధీజీ 2) తిలక్
3) దాదాభాయ్ నౌరోజీ 4) కె.ఎం. ఫణిక్కర్

29. 1905 లో అతివాదం తలెత్తడానికి కారణం కాని అంతర్జాతీయ సంఘటన ఏది?
1) ఇటలీ అబిసీనియా చేతిలో ఓడిపోవడం
2) రష్యా జపాన్ చేతిలో ఓడిపోవడం
3) రష్యాలో శూన్యవాదం తలెత్తడం
4) 1905 లో కర్జన్ బెంగాల్ విభజన చేయడం

30. 1858 విక్టోరియా మహారాణి ప్రకటనను భారతదేశంలో మానవ హక్కుల మాగ్నా కార్టాగా పేర్కొన్నది ఎవరు?
1) ఫిరోజ్ షా మెహతా 2) సురేంద్రనాథ్ బెనర్జీ
3) గోపాలకృష్ణ గోఖలే 4) దాదాభాయ్ నౌరోజీ

31. 'దేశ భక్తుల్లో రాజు'గా పేరొందిన జాతీయ నాయకుడు ఎవరు?
1) తిలక్ 2) లాలాలజపతిరాయ్
3) బిపిన్ చంద్రపాల్ 4) భగత్‌సింగ్

32. అమెరికా నుంచి హోంరూల్ ఉద్యమాన్ని నడిపిన నాయకుడు ఎవరు?
1) లాలాలజపతిరాయ్ 2) బాలగంగాధర తిలక్
3) బిపిన్ చంద్రపాల్ 4) దర్శి చెంచయ్య

33. 1906 లో కలకత్తాలో శివాజీ ఉత్సవాలను రాజకీయ పండుగగా నిర్వహించిన వ్యక్తి ఎవరు?
1) బిపిన్ చంద్రపాల్ 2) అరవిందో ఘోష్
3) బాలగంగాధర తిలక్ 4) ఎవరూ కాదు

34. వందేమాతరం (ఉర్దూ), పీపుల్ (ఆంగ్లం) పత్రికలను నిర్వహించింది ఎవరు?
1) బాలగంగాధర తిలక్ 2) బిపిన్ చంద్రపాల్
3) లాలాలజపతిరాయ్ 4) శిశిర్‌కుమార్ ఘోష్

35. భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి 'పైసా ఫండ్' ఏర్పాటు చేసింది ఎవరు?
1) బాలగంగాధర తిలక్ 2) గోఖలే
3) లాలాలజపతిరాయ్ 4) సుభాష్ చంద్రబోస్

36. మాజినీ (ఇటలీ)ని తన రాజకీయ గురువుగా పేర్కొన్న అతివాద నాయకుడు ఎవరు?
1) లాలాలజపతిరాయ్ 2) బిపిన్ చంద్రపాల్
3) తిలక్ 4) లాలా హరదయాళ్

37. 'మనపై పడే ప్రతీ దెబ్బ ఆంగ్లేయులు స్వయంగా నిర్మించుకుంటున్న శవపేటికలోకి దిగుతున్న ఒక్కొక్క మేకు' అని వ్యాఖ్యానించింది ఎవరు?
1) ఆంధ్ర కేసరి 2) పంజాబ్ కేసరి
3) మైసూర్ పులి 4) లోకమాన్య

38. సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీని 1921 లో స్థాపించిన నాయకుడు ఎవరు?
1) మదన్ మోహన్ మాలవీయ
2) లాలాలజపతిరాయ్
3) అరవిందో ఘోష్ 4) గోపాలకృష్ణ గోఖలే

39. న్యూ ఇండియా అనే ఆంగ్ల వార పత్రికను స్థాపించింది ఎవరు?
1) అనిబిసెంట్ 2) బిపిన్ చంద్రపాల్
3) అరవిందో ఘోష్ 4) అంబేడ్కర్

40. పాండిచ్చేరి యోగిగా పేరొందిన అతివాది ఎవరు?
1) లాలాలజపతిరాయ్ 2) రవీంద్రనాథ్ ఠాగూర్
3) అరవిందో ఘోష్ 4) బాలగంగాధర తిలక్

41. వందేమాతరం ఉద్యమ కాలంలో 'అమర్‌సోనార్ బంగ్లా' గీతాన్ని రచించింది ఎవరు?
1) బంకించంద్ర ఛటర్జీ 2) రవీంద్రనాథ్ ఠాగూర్
3) అరవిందో ఘోష్ 4) లాలాలజపతిరాయ్

42. ఇండియన్ నేషనలిజం అనే గ్రంథ రచయిత ఎవరు?
1) తిలక్ 2) అరవిందుడు
3) రవీంద్రనాథ్ ఠాగూర్ 4) బిపిన్ చంద్రపాల్

43. వందేమాతరం ఉద్యమ కాలంలో నెలకొల్పిన బెంగాల్ జాతీయ కళాశాల తొలి ప్రిన్సిపాల్ ఎవరు?
1) సుభాష్ చంద్రబోస్ 2) రవీంద్రనాథ్ ఠాగూర్
3) అరవిందో ఘోష్ 4) రాస్‌బిహారీ బోస్

44. ఏ రోజును జాతీయ సంతాప దినంగా పాటిస్తారు?
1) 1905 అక్టోబరు 6 2) 1905 అక్టోబరు 16
3) 1919 ఏప్రిల్ 6 4) 1909 ఏప్రిల్ 16

45. భారతదేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1853 2) 1883 3) 1886 4) 1892

46. భారత జాతీయ కాంగ్రెస్ తొలి నామం?
1) ఇండియన్ యూనియన్
2) ఇండియన్ అసోసియేషన్
3) ఇండియన్ నేషనల్ యూనియన్
4) ఇండియన్ నేషనల్ లీగ్

47. 1909 నాటి అలీపూర్ బాంబు కేసులో అరెస్టయిన అరవిందో ఘోష్‌ను నిర్దోషిగా నిరూపించింది ఎవరు?
1) చిత్తరంజన్ దాస్ 2) మోతీలాల్ నెహ్రూ
3) జవహర్‌లాల్ నెహ్రూ 4) తేజ్ బహదూర్ సప్రూ

48. ది లైఫ్ డివైన్, సావిత్రి గ్రంథాలను రచించింది ఎవరు?
1) అరవిందుడు 2) రవీంద్రుడు
3) తిలక్ 4) సుబ్రహ్మణ్య భారతి

49. ఢిల్లీలో స్వదేశీ/ వందేమాతరం ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తి ఎవరు?
1) తిలక్ 2) జోగేష్ చంద్ర ఛటర్జీ
3) సయ్యద్ హైదర్‌రజా 4) మోతీలాల్ నెహ్రూ

50. 1905 జులై 19 న బెంగాల్ విభజన జరిగింది. ఇది ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది
1) 1905 అక్టోబరు 16 2) 1906 అక్టోబరు 16
3) 1905 ఏప్రిల్ 6 4) 1906 ఏప్రిల్ 6

51. 1905 లో బెనారస్‌లో జరిగిన మొట్టమొదటి భారత పరిశ్రమల సమావేశానికి అధ్యక్షత వహించింది ఎవరు?
1) లాలాలజపతిరాయ్ 2) ఎన్.ఎం. లోఖాండే
3) రమేష్‌చంద్ర దత్ 4) దాదాభాయ్ నౌరోజీ

జవాబులు

1-2	10-2	19-2	28-2	37-2	46-3
2-1	11-3	20-3	29-4	38-2	47-1
3-4	12-3	21-2	30-2	39-2	48-1
4-2	13-2	22-3	31-3	40-3	49-3
5-2	14-3	23-4	32-1	41-2	50-1
6-1	15-4	24-1	33-3	42-4	51-3.
7-3	16-3	25-4	34-3	43-3	
8-4	17-4	26-1	35-1	44-2	
9-3	18-1	27-1	36-1	45-3	

- Reddi Guruswamy

Q: Sir, I want to improve myself in good English. Please tell me the essay writing skill (is there any tricks).

A: First, plan your essay. That is, write down all the points you wish to include in your essay. Look at all the points carefully. If you find two or more points of the same kind, put them all together at one place, and renumber all the points. Then prepare a rough copy of the essay you want.

